సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



ఆధార్ తరహాలో అపార్

విద్యార్థులకు అపార్ నంబర్ రానుంది. దీనిపై కసరత్తు మొదలైంది.

- 8లో



ఘనంగా తిరువీధి

జలుమూరు: శ్రీముఖలింగంలో గౌరీ పౌర్ణమి సందర్భంగా గురువారం స్వామికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులను అలంకరించి ప్రత్యేక పూజలు అనంతరం తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.

18న ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్'

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తుఫాను హెచ్చరికతో సిబ్బంది కంట్రోల్ రూంకి వచ్చి పనిచేసే విధంగా ప్రొసీడింగ్స్ జారీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జలవనరుల శాఖ, ముఖ్య ప్రణాళిక, తదితర అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాగావళి, వంశధార, బహుదా, తదితర నదులు ఉన్నాయని, నదుల గట్లు, నదుల కాలువ గట్లు, మరమ్మతులు ఏమైనా ఉంటే తక్షణమే ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. ఫ్లడ్ మానిటరింగ్ మీటర్లు ఉన్నదీ లేనిదీ జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్ కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 08942-240557 తుఫాను నష్ట సమాచారాన్ని కంట్రోల్ రూంకు తెలియజేయాలన్నారు.

జిల్లాలో మోస్తరు జల్లులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 326.2 మిల్లీమీటర్ల వాన పడింది.

ఆదిత్యుని సన్నిధిలో సినీ నటుడు తనికెళ్ల భరణి



తనికెళ్లకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న శంకర శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి కుటుంబ సమేతంగా గురువారం ఉదయం దర్శించుకున్నారు. తులాసంక్రమణం సందర్భంగా ఆదిత్యునికి క్షీరాభిషేక సేవ జరిగిన అనంతరం ఈయన స్వామిని దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ ఇలాంటి దివ్యమైన సూర్యక్షేత్రం అరసవల్లిలో ఉండడం ఇక్కడి వారి అదృష్టమన్నారు.

120 రోజులు రూ.30 కోట్లు

ఆమదాలవలసలో ఇసుక దోపిడీ


- 120 రోజుల కూటమి పాలనలో రూ.30కోట్లకు పైగా దోచుకున్న వైనం
- నాగావళి, వంశధార నదుల్లో అడ్డగోలుగా తవ్వకాలు
- సాయంత్రం 6.30 గంటల తర్వాత ఇష్టారీతిన విక్రయాలు
- రవాణా చార్జీలతో కలిపి ఒక్కో లారీకి రూ.45వేలకు పైగా వసూలు
- కీలక నేతకు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు కప్పం
- దందాకు అడ్డొచ్చినోళ్లపై దాడులు

ఆమదాలవలస మండలం సరిహద్దులోని బావాజీపేటలోని ఓ ప్రైవేటు కంపెనీ యార్డ్‌లో స్టాక్ చేసిన భారీ ఇసుక ఇసుక దిబ్బలివి. దాదాపు 60కి పైగా లారీలకు సరిపడా ఇసుక పోగులివి. ఇక్కడి నుంచి విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రవాణా చార్జీలతో కలిపి రూ. 45వేల నుంచి రూ. 50వేలకు సరఫరా చేస్తున్నారు.





ఆమదాలవలస మండలం దూసి గ్రామ పరిధిలోని నాగావళి నదిలో తవ్విన ఇసుకను స్టాక్ పాయింట్‌ల వద్దకు తీసుకొస్తున్న ట్రాక్టర్లివి. పగలు స్టాక్ పాయింట్ వద్దకు ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి సాయంత్రం విక్రయిస్తున్నారు.



ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ వద్ద నాగావళి నదిలో పట్టపగలే అనధికారికంగా తవ్వకాలు జరిపి, ట్రాక్టర్లకు లోడింగ్ చేసి స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్న దృశ్యమిది. స్టాక్ పాయింట్ నుంచి విశాఖపట్నం నుంచే వాహనాలకు విక్రయిస్తున్నారు.



ఆమదాలవలస మండలం ఇసుకలపేట వద్ద అనధికారికంగా స్టాక్ చేసిన ఇసుక ఇది. పక్కనే ఉన్న నాగావళి నదిలో తవ్వి ఇక్కడికి తీసుకొస్తున్నారు. సాయంత్రం 6.30 గంటల తర్వాత విశాఖ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలకు ఇసుకను విక్రయిస్తున్నారు.



ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీ దిబ్బలపేటలో అక్రమంగా వేసిన ఇసుక పోగులివి. పక్కనే ఉన్న నాగావళి నదిలో తవ్వి ఇక్కడ స్టాక్ చేయిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటల తర్వాత రవాణా సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి విశాఖపట్నంకు తరలిపోతోంది. ఒక్కో లారీ నుంచి ప్రభుత్వం నిర్దేశించిన టన్నుకు రూ. 340తో పాటు అదనంగా రూ. 14వేలు వసూలు చేస్తున్నారు. రవాణా చార్జీలతో కలిపి విశాఖ జిల్లాలో రూ.45వేల నుంచి రూ. 50వేల వరకు విక్రయిస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వం అధికారికంగా కాఖండ్యాం-నారాయణపురం సమీపంలో నిర్వహిస్తున్న డీసిల్టేషన్ పాయింట్‌లో నేరుగా లారీలు అనుమతించిన దృశ్యమిది. తొలుత ఇక్కడ సీఎం తాలూకా అని విజయవాడకు చెందిన వ్యక్తులు అడ్డగోలుగా ఇసుక దోపిడీ చేశారు. తర్వాత డీసిల్టేషన్ పాయింట్‌కు అనమతిచ్చారు. దీంతో అక్రమాలకు చట్టబద్ధత కల్పించినట్టైంది. తవ్వకాల దగ్గరే లారీలకు లోడింగ్ చేస్తున్నారు. అదనంగా లోడ్ చేసి పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. కీలక నేత, స్థానికులకు అని అదనంగా మరో రూ.14వేలు ప్రస్తుతం వసూలు చేస్తున్నారు.







ఆమదాలవలస మండలం కొత్తవలసలో అక్రమంగా తవ్విన ఇసుకను తీసుకొచ్చేందుకు వినియోగిస్తున్న ట్రాక్టర్లు, తవ్వకాలతో పాటు లారీలకు లోడ్ చేసేందుకు ఉపయోగిస్తున్న ప్రొక్లెన్లర్, జేసీబీలివి. ఈ ప్రాంతం పక్కనే నాగావళి నదిలో తవ్వకాలు జరుపుతున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఆమదాలవలస ఇసుక దోపిడీకి కేరాఫ్‌గా మారిపోయింది. నాగావళి, వంశధార ఇక్కడ ప్రవహిస్తున్నది ఇసుక దోచుకునేందుకే అన్నంతగా ఇక్కడ నదులను కబళించేస్తున్నారు. రవాణా చార్జీలతో కలిపి ఒక్కో లారీ ఇసుకను రూ.45 వేలకు పైగా విక్రయిస్తున్నారు. వాహనం తెచ్చుకుంటే టన్నుకి రూ.340 చొప్పున 20 టన్నులకు గాను రూ. 6800వసూలు చేయడంతో పాటు కీలక నేత కప్పం పేరుతో రూ.10వేల నుంచి రూ.12వేలు, స్థానిక తమ్ముళ్ల ముడుపులని రూ.2వేల నుంచి రూ.4వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. నదుల్లో తవ్వి సమీప ప్రాంతంలోని తోటల్లో, ఖాళీ యార్డ్‌ల్లో, కొండ ప్రాంతాల్లో స్టాక్ చేస్తున్నారు. సాయంత్రం 6.30గంటల తర్వాత విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి నేరుగా విశాఖకు తరలిస్తున్నారు.

రూ.30కోట్లకు పైగా దోపిడీ

జిల్లా వ్యాప్తంగా ఇసుక దందా నడుస్తున్నప్పటికీ ఒక్క ఆమదాలవలస నియోజకవర్గంలోనే 120 రోజుల కూటమి పాలనలో రూ. 30కోట్లకు పైగా ఇసుక దోపిడీ జరిగింది. గ్రామ స్థాయి నాయకుల నుంచి నియోజకవర్గ కీలక నేతల వరకు ఇందులో భాగస్వాములై ఉన్నారు. కీలక నేతకు కప్పమని, తమ్ముళ్లకు ముడుపులని అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. రోజుకు రూ. 25లక్షలకు పైగా అనధికారిక ఇసుక విక్రయాలతో అధికార పక్ష నాయకులు దోచుకుంటున్నారు. ఒకరిద్దరు అధికారులు వెళ్లి అభ్యంతరం పెట్టినా వెనక్కి తగ్గడం లేదు. అధికారులెవ్వరూ రావద్దు.. దందాను అడ్డుకోవద్దంటూ నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే...

ఆమదాలవలస నియోజకవర్గంలో నాగావళి, వంశధార నదీ తీర ప్రాంతాలైన దూసి, ఇసుకలపేట, దిబ్బలపేట, తొగరాం, కొత్తవలస, నిమ్మ తొర్లాడ, పాతూరు, కాఖండ్యాం, నారాయణపురం, అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొరపాం, తోటాడ , సింగూరు, చెవ్వాకులపేట గ్రామాల సమీపాన నాగావళి, వంశధార నదుల్లో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. నదీ తీరంలోని తోటల్లో తవ్విన ఇసుకను స్టాక్ చేస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలకు విక్రయాలు ప్రారంభమై రాత్రంతా ఇసుక లారీల జాతర నడుస్తోంది. అక్రమాలను ఎవరైనా అడ్డుకుంటే వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల ఆమదాలవలస నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన సనపల సురేష్‌పై ఇసుక మాఫియా దాడి చేసింది. బుధవారం కూడా మళ్లీ దాడి చేసి తిరిగి ఆయనపైనే కేసులు పెట్టింది. దీంతో మిగతా వారు వెనక్కి తగ్గిపోతున్నారు.

విద్యార్థిని మృతిపై ఆందోళన



ఆస్పత్రి వద్ద మృతురాలి తల్లి లక్ష్మమ్మతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి

పాతపట్నం: పాతపట్నం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న సవర లావణ్య మృతి చెందింది. దీనిపై గురువారం రాత్రి 8 గంటలకు పాతపట్నం ఆస్పత్రి వద్ద లావణ్య తల్లి లక్కమ్మ, బంధువులు, గిరిజన నాయకులు వాబ యోగి, చౌదరి లక్ష్మీనారాయణ ధర్నా నిర్వహించారు. ఏకలవ్య స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని, మృతిపై విచారణ చేపట్టి, కారణాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. దీంతో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాతపట్నం, కొత్తూరు సీఐలు రామారావు, ప్రసాదరావులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. విషయాన్ని ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డికి తెలియజేయడంతో రాత్రి 9 గంటలకు ఆస్పత్రి వద్దకు పీఓ చేరుకుని ధర్నా నిర్వహిస్తున్న మృతురాలి తల్లి లక్కమ్మతో మాట్లాడారు. పాప మృతికి ఏకలవ్య స్కూల్ ఉపాధ్యాయులే కారణమని, విచారణ చేపట్టాలని పీవోను కోరారు. మృతి గల కారణాలపై ఏకలవ్య స్కూల్‌పై విచారణ చేపడతామని ఆయన హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. మృతిపై లావణ్య తల్లి లక్కమ్మ ఎస్ఐ లావణ్యకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

టెక్కలి నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సులు

టెక్కలి: అయ్యప్ప భక్తుల కోసం టెక్కలి ఆర్టీసీ డిపో నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రకాల టూర్ ప్యాకేజీల ద్వారా సేవలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. 5 రోజుల ప్యాకేజీలో టెక్కలి నుంచి విజయవాడ మీదుగా ఎరుమేలి పంబ చేరుకుని తిరుగు ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, అన్నవరం, సింహాచలం మీదుగా టెక్కలి చేరుకుంటారు. 7 రోజుల ప్యాకేజీలో టెక్కలి నుంచి విజయవాడ మీదుగా కాణిపాకం, శ్రీపురం, భవానీ, పళని ఎరుమేలి మీదుగా పంబ సన్నిధానం చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, అన్నవరం, సింహాచలం మీదుగా టెక్కలి చేరుకుంటారు. 11 రోజుల ప్యాకేజీలో టెక్కలి నుంచి విజయవాడ మీదుగా శ్రీశైలం, మహానంది, కాణిపాకం, శ్రీపురం, భవానీ, పళని గురువాయూర్, ఎరుమేలి పంబ సన్నిధానం చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో త్రివేండ్రం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం, కంచి, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, అన్నవరం, సింహాచలం మీదుగా టెక్కలి చేరుకుంటారు. మరిన్ని వివరాలకు 9959225611, 7382923311, 9908190801 నంబర్లను సంప్రదించాలని డిపో మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడించారు.

ఇసుక టెండర్లన్నీ రద్దు

- వాటాలు తేలక జిల్లాలో ఇసుక టెండర్లను రద్దు చేస్తూ కమిటీ నిర్ణయం
- రీచ్‌లన్నీ తమకే కావాలంటూ అమరావతి పెద్దల పట్టు
- తమ నియోజకవర్గాల్లో రీచ్‌లు తమకే కావాలంటున్న ఎమ్మెల్యేలు
- ఎటూ తేల్చుకోలేక టెండర్ల రద్దుకు ఆదేశాలిచ్చిన సర్కార్



అరసవల్లి: ఉచిత ఇసుక విధానమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలి అడుగులోనే వెనకడుగు వేసింది. జిల్లాలో ఇసుకను పంచేసుకుని దోచేసుకుందామనుకున్న అధికార పార్టీ నేతలు, బడా నేతల మధ్య ఇసుక వాటాల లెక్కలు తేలకపోవడంతో సర్కారు అధికారికంగా ప్రకటించిన టెండర్లనే రద్దు చేసేలా పరిస్థితులు దాపురించాయి. అధికార టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో కూడా ఈ వ్యవహారంలో ఏకాభిప్రాయం లేకపోవడంతో ఇసుక పంపకాలు సర్కార్‌ను ఇరకాటంలోకి నెట్టేశాయి.

అన్నీ రద్దు..

జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15న బూరవల్లి, అంబళ్లవలస (గార), బట్టేరు, హయాతినగరం (శ్రీకాకుళం), నివగాం (కొత్తూరు), గోపాలపెంట (నరసన్నపేట) రీచ్‌లకు టెండర్ల ప్రక్రియను జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. అలాగే జిల్లాలో పురుషోత్తపురం-1, పురుషోత్తపురం-2 (సరుబుజ్జిలి), ముద్దాడ పేట (ఎచ్చెర్ల), ముద్దాడపేట (ఆమదాలవలస), కిల్లిపాలెం (శ్రీకాకుళం), పర్లాం (నరసన్నపేట) తదితర మరో ఆరు రీచ్‌లకు కూడా టెండర్ల బిడ్ దాఖలు చేయడానికి ఈనెల 18వ తేదీ గడువుగా నిర్ణయించి ప్రకటించారు. ఈ నెల 23న వీటికి టెండర్లు ఖరారు చేయాల్సి ఉంది. అయితే ఈ నెల 15న జరిగిన టెండర్ల ఖరారు ప్రక్రియలో నిబంధనలను తొక్కిపెట్టి, ఇష్టానుసారంగా టెండర్ల ఖరారు చేశారనే ఆరోపణలు తీవ్రంగా వచ్చాయి. దీనిపై 'సాక్షి'లో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. టెండర్ల విషయంలో పాతపట్నం, నరసన్నపేట ఎమ్మెల్యేలు పట్టుపట్టడం కూడా రాష్ట్ర స్థాయిలో చర్చలకు దారి తీసింది. దీంతో చేసేదేమీ లేక నాలుగు రీచ్‌ల వరకు అమరావతి వ్యాపారులకు, అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలకే చెరో రీచ్‌ను ఇచ్చేసేలా అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇక్కడే అసలు యుద్ధం మొదలైంది.

అమరావతి వారి కోసమే.. అంతా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిని రాజధానిగా చేయాలని ఎలా నిర్ణయించుకున్నారో... అలాగే అక్కడి బడా వ్యాపారులను, ముఖ్య నేతల బినామీలను ఉత్తరాంధ్రలోని ఇసుక రీచ్‌లన్నీ కట్టబెట్టాలని రాష్ట్ర అధికార ముఖ్య నేత కంకణం కట్టుకున్నారట. ఇందులో భాగంగా ఎలాగైనా అమరావతి వారికి స్థానిక జిల్లాలో ఇసుకను దోచి పెట్టేందుకు సర్వం సిద్ధం చేశారు. తీరా స్థానికంగా ఉండే సొంత పార్టీ ఎమ్మెల్యేలే బడానేతల నిర్ణయాలకు ససేమిరా అంటుంటే చేసేదేమీ లేక టెండర్లను తాత్కాలికంగా రద్దు చేశారు. అయితే ఇక్కడే సర్కార్ ఎత్తుగడ కూడా స్పష్టమవుతోంది. ఇక్కడి వారికి ధ్రువీకరణ పత్రాలు లేవని అమరావతి వ్యాపారులు మాత్రమే అర్హులని తేల్చేస్తూ వారికే ఇసుక ఇచ్చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా చేస్తే స్థానిక ఎమ్మెల్యేల ఆట కట్టించవచ్చని భావిస్తున్నారు.

తమకు కావాలంటూ..

మన జిల్లాలో నాణ్యమైన ఇసుక లభిస్తుంది. ఇక్కడ నదీ తీరాల్లో ఇసుక రీచ్‌లన్నీ తమకే కావాలంటూ అధికార పార్టీకి చెందిన అమరావతి ప్రాంత వ్యాపారాలు, బడా నేతల బినామీలు పట్టుపడుతుంటే మరో వైపు బగ్గు, మామిడి వంటి స్థానిక ఎమ్మెల్యేలు కూడా ఈ రీచ్‌లు తమకే కావాలని కోరుతున్నారు. దీంతో ఒత్తిళ్లకు తలొగ్గి ఒక్కొక్క రీచ్‌లను ఇచ్చేలా అధికారులు తలూపారు. దీంతో మిగిలిన రీచ్‌ల విషయంలో ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. అధిష్టానం సూచన మేరకు తామంతా సైలెంట్‌గా ఉన్నామని, వాళ్లిద్దరికీ రీచ్‌లు కేటాయిస్తే తమ పరిస్థితి ఏంటని ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్లు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ ఏ మాట చెప్పినా శిరసా వహిస్తామని ఒక్క ఇసుక రీచ్‌ల విషయం తప్ప అంటూ షరతుల సందేశాలను పంపిస్తున్నారు. దీంతో అటు అమరావతికి.. ఇటు స్థానిక నేతలకు న్యాయం చేయలేక కూటమి సర్కార్ టెండర్ల రద్దునకు ఆదేశాలు జారీ చేసిందని తెలుస్తోంది. ఈ నెల 15న ప్రకటించిన ఆరు రీచ్‌ల టెండర్లుతో పాటు కొత్తగా టెండర్ల ప్రక్రియ జరుగనున్న మరో ఆరు రీచ్‌ల టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా రద్దు చేశారు.

కమిటీ నిర్ణయం మేరకు రద్దు



జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధికారాల ప్రాప్తికి ఇసుక టెండర్లన్నీ ప్రస్తుతానికి రద్దు చేశాం. ఈనెల 15న వేసిన 6 టెండర్లతో పాటు కొత్తగా ప్రకటించిన ఆరు రీచ్‌ల టెండర్లు కూడా రద్దు చేసేశాం. టెండర్ నిబంధనల ప్రకారం చూస్తే కొన్ని చోట్ల డీవియేషన్లు జరిగినట్లుగా గుర్తించాం. దీంతో ఇకమీదట ఎలాంటి లోపాలు లేకుండా ఎలాంటి అభ్యంతరాలకు తావులేని విధంగా విధానపరంగా మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తాం. - సి.మోహనరావు, డీడీ, మైన్స్

● 'అల'జడి



కవిటి మండలంలోని సముద్ర తీర ప్రాంతంలో 'అల'జడి రేగింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా సముద్రంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో కెరటాలు ఎగసిపడ్డాయి. దీంతో ఇద్దివానిపాలెం సముద్రతీరంలో లంగరు వేసిన బోట్లు చెల్లా చెదురుకాగా చిన్న పడవలు బోల్తా పడ్డాయి. - కవిటి

20 శాతం ఇచ్చుకో.. వ్యాపారం చేసుకో..

- మద్యం షాపుల్లో 20 శాతం వాటాలు ఇవ్వాల్సిందే
- పాతపట్నం నియోజకవర్గంలో వ్యాపారులకు ఓ టీడీపీ నేత హుకుం
- 9 షాపుల్లో నియోజకవర్గ నేతకు వాటాలు



ఎల్.ఎన్.పేట: ప్రైవేటు మద్యం విధానం ప్రభుత్వానికి రాబడి తీసుకువస్తుందో లేదో గానీ.. అధికార పక్ష నేతలకు మాత్రం కాసులు కురిపిస్తోంది. మద్యం షాపులు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న సమయంలో బెదిరింపులకు దిగిన టీడీపీ నాయకులు అక్కడితో సంతృప్తి పడలేదు. పాతపట్నం నియోజకవర్గంలో కొన్ని మద్యం షాపులు పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు, మరికొన్ని షాపులు తటస్థులు పొందారు. ఈ షాపుల్లో వాటాలు కావాలని పాతపట్నం టీడీపీ ముఖ్య నాయకుడు పట్టుపడుతున్నాడు. తనకు వాటా ఇవ్వకపోతే పాతపట్నంలో ఎలా వ్యాపారం చేస్తారో చూస్తానంటూ బెదిరిస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 14 ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం లాటరీ నిర్వహించింది. లాటరీలో ఒడిశాకు చెందిన వారు ఆరు షాపులు పొందారు. ఈ షాపుల్లో వాటాలు కావాలని పాతపట్నం నియోజకవర్గం అధినాయకుడు డిమాండ్ చేస్తున్నారని అంతటా ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో పాతపట్నం మండలంలో 4, కొత్తూరులో 4, ఎల్.ఎన్.పేటలో 2, హిరమండలంలో 2, మెళియాపుట్టి మండలంలో 2 ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. టీడీపీకి చెందిన వారు షాపు పొందితే వాటా ఇవ్వక్కర్లేదని, బయట వ్యక్తులు మాత్రం వాటాలు ఇవ్వాల్సిందేనని ఆ నాయకుడి నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఇప్పటికే 14 షాపుల్లో 9 దుకాణాల నుంచి 20శాతం వాటాలు తీసుకోవడానికి లెక్కలు తేలిపోయాయి.



● క్యాట్ ఫైట్

పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీలోని బృందావన చంద్ర ఆలయంలో బుధవారం ఓ నాగుపాము రెండు పిల్లుల మధ్య చెలగాటం జరిగింది. ఆలయంలో చిన్న నాగుపాము పడగ విప్పి కనిపించడంతో రెండు పిల్లులు ఒక్కసారి ఆ పామును చుట్టుముట్టాయి. దాదాపు అర్ధగంట సేపు పామును కదలనీయకుండా చేశాయి. పాము పడగ విప్పి బుసలు కొట్టినా భయపడలేదు. అనంతరం సర్పం ఓ రంధ్రంలోకి ప్రవేశించగా విడిచిపెట్టేశాయి. - కాశీబుగ్గ

ప్రత్యేక కౌంటర్ ద్వారా వంట నూనె

శ్రీకాకుళం పాత బస్టాండ్: తక్కువ ధరకు వంటనూనెను ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందజేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. సన్‌ఫ్లవర్ వంట నూనె లీటరు రూ.124కు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో 54 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి రేషన్ కార్డుదారుదారులకు సన్‌ఫ్లవర్ వంటనూనె నెలకు ఒక లీటరు, పామాలిన్ మూడు లీటర్లు విక్రయిస్తామన్నారు.

క్లుప్తంగా

వర్సిటీలో యాంటీ డ్రగ్ కమిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యాంటీ డ్రగ్ (మాదక ద్రవ్యాల నియంత్రణ) కమిటీని ఏర్పాటు చేస్తూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు తారకేశ్వరరావు, శ్రావణి, శ్రీధర్, హరిత, కేవీఎస్ మూర్తి, తిరుపతిరావు, శ్యామల, కరుణానిధి, శాంతిలను కమిటీ సభ్యులుగా నియమించారు. విద్యార్థుల విభాగం నుంచి సాయిఅరుణ్‌కుమార్, భార్గవ్‌లకు ప్రాతినిధ్యం కల్పించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు వీరు కృషి చేస్తారు.

కలెక్టర్‌ను కలిసిన బుడితి కార్మికులు

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన కంచు, ఇత్తడి కార్మికులు కింతా బుజ్జి ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిశారు. నెల రోజుల పాటు శ్రమించి తయారు చేసిన పూర్ణ ఘటాన్ని విజయవాడ సచివాలయానికి చేరవేయాలని కోరారు. కంచు, ఇత్తడి పరిశ్రమకు ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ త్వరలో గ్రామాన్ని సందర్శించి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో మిగులు సీట్ల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ నెల 21 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. సెట్ ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నారు. పీజీ సెట్ ర్యాంకు తప్పనిసరి కావడంతో స్పందన తక్కువగా ఉంది.

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ అధిపతిగా అశోక్

బూర్జ: మండలంలోని పెద్దపేటలో గల డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా, అధిపతిగా డాక్టర్ పి.అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వెంకటరామన్నగూడెంలోని అర్టికల్చర్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తించి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్తగా టి.రాజశేఖరం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెట్లూరులోని నిమ్మపరిశోధనా స్థానంలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



కాశీబుగ్గ/కంచిలి : సోంపేట రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్పీ పలాస పోలీసులకు సమాచారం అందగా ఏఎస్ఐ మెట్ట సోమేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు పాతికేళ్ల వయసు, నలుపు ఫ్యాంటు, నీలం టీషర్టు ధరించి, చేతికి మెడకు దేవుడి తాళ్లు కట్టుకుని ఉన్నాడని, ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వంశధార ఎస్ఈగా కేవీఎన్ స్వర్ణకుమార్



శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): వంశధార ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా)గా కేవీఎన్ స్వర్ణకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న రాంబాబు కేడీఎస్ సీఈగా, కడా ఎస్ఈగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. స్వర్ణకుమార్ గతంలో చీఫ్ ఇంజినీర్ నార్త్‌కోస్ట్ విశాఖపట్నంలో డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా అనంతరం బీఆర్ఆర్ వంశధార డీఎస్ఈగా 2023 జూన్‌లో విధుల్లో చేరారు. ఇప్పుడు ప్రభుత్వం ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఒరిజినల్ పత్రాలు తప్పనిసరి

శ్రీకాకుళం: సమగ్ర శిక్షా సొసైటీ (పాఠశాల విద్యా శాఖ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం)లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకం కోసం ఎంపిక చేసిన అభ్యర్థులు వారి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని డీఈఓ తిరుమల చైతన్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్టు), పొరుగుసేవలు (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదిక 2024-25 విద్యా సంవత్సరంలో ఒక ఏడాది కాలానికి పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎంపికైన అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఉదయం పది గంటలకు హాజరు కావాలన్నారు. ఈనెల 18వ తేదీన సీఆర్టీ గణితం, ఫిజికల్ సైన్స్, పీజీటీ ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ అభ్యర్థులు, ఈ నెల 19వ తేదీన సీఆర్టీ బయో సైన్స్, సోషల్, తెలుగు, అకౌంటెంట్, వార్డెన్, పార్ట్ టైం టీచర్లు హాజరు కావాలన్నారు.

ఆధార్ తరహాలో ▸ అపార్



అపార్‌కార్డు నమూనా

- విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- వన్ నేషన్ – వన్ స్టూడెంట్ నినాదంతో ఐడీ కార్డుల జారీకి కేంద్రం శ్రీకారం
- జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- తొలి విడతగా 9, 10, ఇంటర్ విద్యార్థులకు నమోదు
- డేటా నమోదులో పాఠశాల నిర్వాహకుల బిజీబిజీ

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్‌ను కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేయనున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో మొత్తం పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 2840 ఉండగా వీటిల్లో 3,21,200 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కేజీ నుంచి పీజీ వరకు..

కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఈ 'అపార్' నంబర్ కేటాయించనున్నారు. మొదటగా ప్రైమరీ స్కూల్ నుంచి హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నంబర్ కేటాయించనున్నారు. జిల్లాలో మాత్రం ముందుగా 9, 10, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు అపార్ కార్డులకు సంబంధించిన డేటాను నమోదు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ప్రస్తుతం యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి 'పెన్' (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతో పాటు 'టీసీ' (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్)లు జారీ చేస్తున్నారు. ఇకపై అపార్ కార్డు ఉంటే శ్రీకాకుళం విద్యార్థి హైదరాబాద్‌లో, ఢిల్లీలో, కాశ్మీర్‌లో ఇలా దేశంలో ఎక్కడికైనా వెళ్లి సులువుగా చదువుకోవచ్చు.

కార్డు పొందేదిలా?

అపార్ కార్డు పొందే విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి కచ్చితంగా విద్యాసంస్థకు వెళ్లాలి. తొలుత యూడైస్ ప్లస్ నమోదైన వివరాలను వారు సరిచూసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనికి ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ ధ్రువీకరణ తప్పనిసరి. విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు ఒకసారి వెలువడితే దాని సవరణకు అవకాశం ఉండదు. కాబట్టి అన్నీ ముందే సరిచూసుకోవాలి. ప్రస్తుతం అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల డేటా నమోదులో హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు బిజీబిజీగా ఉన్నారు. అయితే మెజారిటీ విద్యార్థుల ఆధార్‌కార్డులలో అనేక తప్పులు ఉండటం, టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్క్స్ మెమో, ఆధార్‌కార్డులలో వారి పేర్లు/తల్లిదండ్రుల పేర్లు/జనన తేదీ ఒకే విధంగా లేకపోవడం, ఆధార్‌కు ఫోన్ నంబర్లు అనుసంధానమై లేకపోవడం వంటి కారణాలతో తీవ్రమైన జాప్యం జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు.



ఇంటర్మీడియెట్ విద్యార్థులు

రోజూ సమీక్షిస్తున్నాం..



ఆధార్ మాదిరిగా విద్యార్థులకు అపార్ కార్డు జారీకి కేంద్రప్రభుత్వం ఆలోచన చేయడం శుభపరిణామం. విద్యార్థుల డేటా నమోదుకు ప్రతిరోజు ప్రిన్సిపాళ్లతో సమీక్షిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే దిశగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయిస్తున్నాం. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం.
– శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ, శ్రీకాకుళం

తప్పులతో జాప్యం..



వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో విద్యార్థులకు అపార్ కార్డు జారీ వల్ల వారి భవితవ్యానికి, జీవిత కాలంపాటు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే డేటా నమోదు అనేక సవాళ్లతో కూడుకుని ఉంది. టెన్త్ మార్క్స్ మెమో, ఆధార్‌కార్డులలో దోషాలు, రెండింటా తేడాలు ఉండటం వల్ల ఆన్‌లైన్లో తీసుకోవడం లేదు. తల్లిదండ్రులు చొరవ చూపాలి.
– కీర్తి తవిటినాయుడు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల కొయ్యాం

ఉపయోగాలు అనేకం..

- అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉండటంతో వారికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.
- విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్ క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు అన్నీ కలిపి డిజిటల్ కార్డు రూపంలో భద్రపరుస్తారు.
- విద్యార్థి చదువుకు సంబంధించిన అకడమిక్, విద్యా సంబంధిత వివరాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి.
- విద్యార్థులు సాధిస్తున్న మార్కులు, వారికి వచ్చిన గ్రేడ్, ఉపకార వేతన వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తుంటారు.
- విద్యార్థికి కేటాయించిన నంబరును ఇంటర్నెట్‌లో అన్వేషించడం లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం చిటికెలో వచ్చేస్తుంది.
- వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ సులువుగా పూర్తవుతుంది.
- ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ, ఇంటర్వ్యూల సమయంలో అపార్ కీలకం కానుంది. అకాడమీ పరంగా విద్యార్థికి జీవితకాల గుర్తింపుగా పరిగణిస్తారు.
- విద్యార్థి వివరాలన్నీ డీజీ లాకర్ అనుసంధానమై ఉండడంతో సర్టిఫికెట్లను కూడా సులువుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇతర కీలక సమయాల్లో ప్రామాణికంగా తీసుకుంటారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాలల రక్షిత గృహాల నిర్వహణపై అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 11 కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 13 కేంద్రాలు రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్లు చెప్పారు. వాటిపై కేసు నమోదు చేసి తక్షణమే మూయించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో ఖాళీలు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాల్లోని చిన్నారులను ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించాలన్నారు. దత్తతకు అర్హులైన బాలలకు సంబంధించి వైద్య పరీక్షల నివేదికలు వెంటనే మహిళా శిశు సంక్షేమాధికారికి అందజేయాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం 'మునగ చెట్టు మహిళలకు ఆరోగ్యానికి తొలిమెట్టు' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి, బాలల సంరక్షణ అధికారి కె.రమణ, ఆర్ఐఓ దుర్గారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంక్షేమ అధికారి అనురాధ, విద్యా శాఖ ఏడీ లియాఖత్ అలీఖాన్, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : గత ఎన్నికల్లో శాసన సభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సనపల సురేష్‌పై బుధవారం బలగ– రిమ్స్ కూడలిలో కారును అడ్డగించి కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గుండు మోను ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. ఘటనాస్థలి వద్ద సీసీ పుటేజీని పరిశీలించి నిందితులను గుర్తిస్తున్నామని చెప్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తిపై కేసు నమోదైనట్లు ఏఎస్ఐ నారాయణరావు గురువారం తెలిపారు. ఆమదాలవలస మండలానికి చెందిన సనపల సురేష్ అనే వ్యక్తిపై కిల్లిసాయితేజ, తమ్మినేని అశోక్‌కుమార్‌లు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేనులవలసలో కక్ష సాధింపు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపులకు అడ్డూ అదుపూ లేకుండా ఉన్నాయి. చోడవరం, పారశిల్లిలో ఇటీవల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆస్తులను ఆక్రమణల పేరిట తొలగించగా.. తాజాగా వీఎన్ పురం పంచాయతీ చేనులవలసలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి స్వాధీనంలో ఉన్న గ్రామ కంఠం స్థలాన్ని పోలీసు బందోబస్తు నడుమ చేజిక్కించుకున్నారు. ఈ స్థలంలో లబ్బ గోపాలరావు, లబ్బ కాశియ్య పశువుల శాల, గడ్డికుప్పలు వేసుకొని ఉండగా వీటిని రెవెన్యూ సిబ్బంది పోలీసు బందోబస్తుతో వచ్చి గురువారం తొలగించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచి తమ ఆధీనంలోనే స్థలం ఉందని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాజకీయ కక్షతో తొలగించారని వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి గురువారం ఆక్రమణలు తొలగించామని స్పష్టం చేశారు.



జేసీబీతో పశువుల పాకను తొలగిస్తున్న దృశ్యం

గోపాలపెంటలో ఇసుకరీచ్ ప్రారంభం

నరసన్నపేట: జిల్లాలో పూర్తి స్థాయిలో ఇసుకను అందుబాటులోనికి తీసుకొస్తామని, ఈ నెలాఖరు కల్లా 12 ఇసుక రీచ్‌లను ప్రారంభిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నరసన్నపేట మండలం గోపాలపెంటలో ఇసుక రీచ్‌ను స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా ఆరు రీచ్‌లను వినియోగంలోనికి తీసుకువస్తున్నామని చెప్పారు. మిగిలినవి కూడా నాలుగు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ఇవి కాక, మరో ఆరు రీచ్‌లకు టెండర్లు పిలిచామని, వీటిని నెలాఖరుకల్లా వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్‌లో గానీ ఇసుక బుక్ చేసుకోవచ్చని చెప్పారు. నాటుబళ్ల ద్వారా సొంత అవసరాలకు తీసుకెళ్లడానికి ఎటువంటి ఆటంకం ఉండదని తెలిపారు. యంత్రాలను వినియోగించకుండా మనుషుల ద్వారా ట్రాక్టర్లలో లోడ్ చేసి డంపింగ్ చేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ మోహనరావు, ఆర్ఐ మాణిక్యాలరావు, ఆర్డీఓ సాయి ప్రత్యూష, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

అనైతిక బంధానికి ముగ్గురు బలి

- భార్య, యువకున్ని హత్య చేసి, భర్త ఆత్మహత్య
- బెంగళూరులో ఘోరం
- మృతులు జిల్లావాసులు

బనశంకరి (బెంగళూరు): తప్పుదోవ పట్టిన భార్య, ఆమె ప్రియుని కథ విషాదాంతమైంది. ఆమె భర్త వారిద్దరినీ అక్కడికక్కడే హత్య చేసి తాను కూడా ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు కోణణకుంటె పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. సోమేశ్వర లేఔట్‌లో నిర్మాణ దశలో ఉన్న కట్టడంలో బుధవారం రాత్రి కూలీ కార్మికురాలు లక్ష్మి (33), ఆమె ప్రియుడు గణేష్‌కుమార్ (20) ఏకాంతంగా ఉన్నారు. వారిని గమనించిన ఆమె భర్త గొల్లబాబు (41) తీవ్ర కోపోద్రిక్తుడై కట్టె తీసుకుని ఇద్దరిని చావబాదాడు. దెబ్బలకు వారు మృత్యువాత పడ్డారు. కొన్ని గంటల తరువాత అతడు అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

నిఘా వేసి ప్రాణాలు తీసి..

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముగ్గురూ కొన్నేళ్ల కిందట ఉపాధి కోసం బెంగళూరుకు వచ్చి కట్టడం పనులు చేసుకుంటూ జీవించేవారు. అవివాహితుడైన గణేష్‌కుమార్, గొల్లబాబు దంపతుల వద్దే ఉండేవాడు. వారికి అతడు దూరపు బంధువు అవుతాడని తెలిసింది. ఈ సమయంలో అతని భార్యతో చనువు పెరిగి అనైతిక సంబంధానికి దారితీసినట్లుగా అనుమానాలున్నాయి. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై గొల్లబాబుకు అనుమానం పుట్టింది. దీంతో ఆమెపై నిఘా వేశాడు. యువకునితో కలిసి ఉన్న సమయంలో దాడి చేసి హతమార్చాడని దక్షిణ విభాగ డీసీపీ లోకేశ్ భరమప్ప జగలాసర్ తెలిపారు. తర్వాత అతడు బావమరిదికి ఫోన్ చేసి విషయం తెలియజేసి, తాను కూడా చనిపోతున్నానని చెప్పి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందిన వెంటనే కోణణకుంటె పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.



సంఘటన జరిగిన కట్టడం



భర్త గొల్లబాబు, హత్యకు గురైన లక్ష్మి, గణేశ్‌కుమార్ (ఫైల్)

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



తవిటినాయుడు మృతదేహం

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట) గ్రామానికి చెందిన కంచుపల్లి తవిటినాయుడు(44) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తవిటినాయుడు గతంలో బైక్ ప్రమాదంలో గాయపడినప్పటి నుంచి మానసిక స్థితి బాగాలేదు. మద్యానికి అలవాటు పడి తరచూ గొడవలుపడేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు రామచంద్రపురంలోని బంధువుల ఇంటికి వెళ్లిన భార్య కంచుపల్లి రాము, రెండో కుమారుడు సంతోష్‌కి సమాచారం తెలియజేయడంతో వారు వెంటనే వచ్చి 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. భార్య రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది మందిపై కేసు నమోదు

కొత్తూరు: మండలంలోని సిరుసువాడకు చెందిన బూరాడ కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్యతో సహా పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏంఏ అహ్మద్ గురువారం తెలిపారు. కుమారస్వామి బుధవారం రాత్రి కొత్తూరు నుంచి సిరుసువాడలోని తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు ఆపారు. నిత్యం మందు తాగుతూ భార్యను సక్రమంగా చూసుకోకపోవడంతో మందలిస్తున్నామని చెప్పి దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు భార్యతో సహా పది మందిపై కుమారస్వామి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

మూడు ఇసుక లారీలు సీజ్

- కేసు నమోదులో తీవ్ర జాప్యం
- విమర్శలు రావడంతో ఆఖరికి కేసు నమోదు

రణస్థలం: మండలంలోని జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలో పైడిభీమవరం ఇసుక చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి 8 గంటల సమయంలో అనుమతి లేని మూడు ఇసుక లారీలను పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం సమక్షంలో లారీలను స్టేషన్‌కు తరలించారు. అయితే గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు కేసు నమోదు చేయకపోవడం, లారీ యజమానులు నేరుగా సంప్రదింపులు జరపడంపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. రెవెన్యూ అధికారులు సైతం మిన్నకుండిపోయారు. దీనిపై జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవిని వివరణ కోరగా బిల్లులు సరిగా ఉన్నాయని, వదిలేశామని తెలిపారు. ఆపై సీఐ ఎం.అవతారం వివరణ కోరగా ఒడిశా బిల్లులు ఉండటంతో సరి చూసి, తెల్లవారే వదిలేశామని చెప్పారు. మరో అరగంట తర్వాత ఆయనే స్వయంగా ఫోన్ చేసి.. లారీలు ఇక్కడే ఉన్నాయని, కేసు నమోదు చేస్తున్నామని చెప్పడం గమనార్హం.



జె.ఆర్.పురం సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచిన ఇసుక లారీలు

మద్యం షాపులు.. నిబంధనలకు తూట్లు

గార: మద్యం దుకాణాలను టెండర్ల ద్వారా దక్కించుకున్న వారు షాపుల ఏర్పాటులో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాలు, పాఠశాలలకు 200 మీటర్లు దూరంలో ఏర్పాటు చేయాలని నిబంధన స్పష్టంగా ఉన్నా చాలామంది పాటించడం లేదు. గార మండలం శ్రీకూర్మం పంచాయతీ పొంగిపేట వద్ద మెయిన్‌రోడ్‌లో దుయాణం ఏర్పాటు చేశారు. దీనికి 20 మీటర్ల దూరంలోని క్రైస్తవ ఆరాధన కేంద్రం, 50 మీటర్లు దూరంలో చర్చి, పొంగిపేట వైపు షిర్డిసాయినాథుని ఆలయం ఉన్నాయి. అక్కడికి కొద్ది దూరంలో మిరియం పాఠశాల ఉంది. దుకాణం ఇక్కడి నుంచి మార్చాలని ఎమ్మార్పీఎస్ ప్రతినిధి రాణా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

దుకాణం అడ్డగింత..

శ్రీకూర్మం మెయిన్ రోడ్డులో దుకాణం ఏర్పాటు చేసేందుకు టెండర్‌దారుడు గురువారం ప్రయత్నాలు చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. వ్యాన్‌తో మద్యం బాటిళ్లు తీసుకురావడంతో సరుకు దించకుండా అడ్డుకున్నారు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది సముదాయించే ప్రయత్నం చేసినా.. యువత, మహిళలు నిరసన వ్యక్తం చేయడంతో వ్యాను వెనక్కి వెళ్లిపోయింది. కె.మత్స్యలేశం పరిధిలో మెయిన్‌రోడ్డులో జనావాసాల మధ్య దుకాణం ఏర్పాటు చేయడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జనావాసాల మధ్యన..

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి–కొత్తపేట మెయిన్ రోడ్డులో గురువారం నివాస గృహాలు, జనావాలసాల మధ్యలో కొత్త మద్యం షాపులు ప్రారంభించడం చర్చనీయాంశమైంది. షాపు నంబర్ 111ని ఇండియన్ బ్యాంకు పక్కనే ఏర్పాటు చేయగా, షాపు నంబర్ 109 ని కొత్తపేట షిర్డీసాయి మందిరం పక్కన ప్రారంభించారు. అయితే వారం రోజులు పాటు మాత్రమే మద్యం అమ్మకానికి తాత్కాలికంగా షాపులకు అనుమతిచ్చామని, త్వరలో పర్మినెంట్ షాపుల ఏర్పాటుకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి అనుమతిస్తామని కోటబొమ్మాళి ఎక్సైజ్ సీఐ గాయత్రి తెలిపారు.



గార: పొంగిపేట వద్ద నిబంధనలకు విరుద్ధగా ఏర్పాటైన మద్యం దుకాణం



కోటబొమ్మాళి: ఇండియన్ బ్యాంకు పక్కన గృహాల మధ్య మద్యం షాపు



కోటబొమ్మాళి: కొత్తపేటలో షిర్డీసాయి గుడి సమీపంలో గృహాల పక్కన మద్యం షాపు